సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం । 13 । ఏప్రిల్ । 2024



హంసవాహనంపై విహారింపు

వేములవాడ: శ్రీరామ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి ఉత్సవమూర్తులను హంసవాహనంపై ఊరేగించారు.



ఘనంగా నవగ్రహ ప్రతిష్ఠ

ముస్తాబాద్: పోతుగల్ శ్రీహన్‌మాన్ ఆలయంలో నవగ్రహ యంత్ర ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
33.0/26.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పడు మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'ఆది'కి క్వార్టర్ కేటాయింపు

- ప్రత్యేక పూజల అనంతరం గృహప్రవేశం



ఆది శ్రీనివాస్ దంపతులకు స్వీటు తినిపిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ: ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు బంజారాహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఓ ఇంటిని ప్రభుత్వం కేటాయించింది. దీంతో శుక్రవారం ఆది శ్రీనివాస్ తన కుటుంబసభ్యులతో కలసి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆది శ్రీనివాస్-వనజ దంపతులను మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు.

గురుకులాల్లో దరఖాస్తుల గడువు పెంపు

సిరిసిల్లటౌన్: బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడగించినట్లు ఎల్లారెడ్డిపేట ఎంజేపీ బీసీడబ్ల్యూఆర్‌సీ ప్రిన్సిపాల్ వీరప్రభాకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, ఇంటర్మీడియెట్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు tsrdccet.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు mjpabcwreis.cgg.gov.inవెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేత్రపర్వంగా ప్రాణ ప్రతిష్ఠాపన



బంగారు మైసమ్మ విగ్రహం

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లో బంగారుమైసమ్మ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన వేడుకలు నేత్రపర్వంగా సాగాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు శుక్రవారం ప్రాణప్రతిష్ఠతో ముగిశాయి. స్థానిక కౌన్సిలర్ దార్ల కీర్తన-సందీప్ చేతుల మీదుగా వేడుకలు నిర్వహించారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, ఆకుల కృష్ణ, కల్లూరి లత పాల్గొన్నారు.

దుకాణాలపై పోలీసుల దాడులు



రాచర్లగుండారంలో పోలీసుల తనిఖీలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల గుండారంలో శుక్రవారం రాత్రి కిరాణ దుకాణాలు, బెల్ట్‌షాపులపై పోలీసులు దాడులు చేశారు. గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో ఏఎస్సై కిషన్ రావు ఆధ్వర్యంలో పోలీసులు కిరాణ దుకాణాలు, బెల్ట్‌షాపులలో తనిఖీలు చేశారు. రాచర్లగుండారం, పరిసర తండాలపై ఏకకాలంలో దాడులు చేసి గుడుంబా, మద్యం స్వాధీనం చేసుకున్నారు. తండాలోని ఇళ్లలోనూ తనిఖీలు చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రంలో శుక్రవారం ఐకేపీ ఏపీఎం నర్సయ్య ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర పొందాలని సూచించారు. సీసీ శ్యామల, పద్మ, రైతులు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- రామగుండం-మణుగూరు నూతన రైల్వేలైన్
- బసంత్‌నగర్ విమానాశ్రయంపై కొత్త ఆశలు
- నవోదయ, కేంద్రీయ విద్యాలయాల పెంపు
- సింగరేణి పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు
- తెరపైకి సుల్తానాబాద్‌లో డ్రైపోర్టు
- కాంగ్రెస్ మేనిఫెస్టోలో పాతజిల్లా ప్రాజెక్టులకు పెద్దపీట



హామీలపై అభయహస్తం!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టో విడుదల చేసింది. 2024 పార్లమెంటు ఎన్నికల కోసం రాష్ట్రంలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తూ రూపొందించిన ఈ మేనిఫెస్టో ఉమ్మడి జిల్లా ప్రజలను ఆలోచింపజేస్తోంది. ఇందులో చాలా డిమాండ్లు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంటూ వస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే మేనిఫెస్టోను అమలు చేస్తామని, తద్వారా ఉమ్మడి జిల్లా మౌలిక వసతులు, ఉపాధి, విద్య, రవాణా, పారిశ్రామిక, వాయు, రైల్వేరంగాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని హస్తం నేతలు స్పష్టం చేస్తున్నారు. ఆరు గ్యారంటీల తరహాలో తాము చెప్పింది అమలు చేస్తామని పునరుద్ఘాటిస్తున్నారు.

బసంత్‌నగర్ విమానాశ్రయం

ఉమ్మడి జిల్లా ముఖచిత్రాన్నిమార్చే సత్తా ఉన్న ప్రాజెక్టు బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టు. ఉడాన్ 5.0లో భాగంగా రాష్ట్రం నుంచి వరంగల్, బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టులు ఎంపికయ్యాయి. గతంలో బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టుకు సంబంధించిన సర్వే పూర్తయి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపినా స్పందన లేదు. తాజాగా కాంగ్రెస్ కొత్త విమానాశ్రయాల ఏర్పాటు తమ మేనిఫెస్టోలో పెట్టేసరికి తిరిగి ఈ ప్రాజెక్టుపై ఆశలు చిగురించాయి. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే.. జగిత్యాల, సిరిసిల్ల, కామారెడ్డి, నిర్మల్, నిజామాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాలకు ఎయిర్‌కనెక్టివిటీ సాధ్యపడుతుంది. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కోటిలింగాల, కాళేశ్వరం, రామగిరిఖిల్లా వంటి ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాల్లో అనూహ్య అభివృద్ధి జరుగుతుంది.

నేడు కరీంనగర్ ఎంపీ అభ్యర్థి ఖరారు

ఉమ్మడి జిల్లాలో జీవన్‌రెడ్డి-నిజామాబాద్, గడ్డం వంశీ- పెద్దపల్లి పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులుగా ప్రకటించిన కాంగ్రెస్ ఇంకా కరీంనగర్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత అసెంబ్లీ తరహాలోనే పారాచూట్ లీడర్లనే రంగంలోకి దించబోతున్నారని సమాచారం. మొదటి నుంచి టికెట్ రేసులో మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ముందుండగా.. తరువాత వెలిచాల రాజేందర్‌రావు, తీన్మార్ మల్లన్న పేర్లు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. వీరిలో అధిష్టానం ఎవరి వైపు మొగ్గుతుందో నేడు తేలనున్నట్లు సమాచారం.

రామగుండం- మణుగూరు కొత్త రైల్వేలైన్

రామగుండం- మణుగూరు రైల్వేలైన్‌కు పెద్దపీట వేస్తామని తెలిపింది. వాస్తవానికి ఇది కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్. దీనికి తాజా బీజేపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 200 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ ప్రాజెక్టుకు బడ్జెట్ అంచనాలు రూ.2వేల కోట్ల పైమాటే. బెల్లంపల్లి నుంచి కొత్తగూడెం వరకు అన్ని సింగరేణి భూగర్భ గనులు, ఓపెన్‌కాస్టులు, థర్మల్ పవర్ ప్రాజెక్టులను అనుసంధానం చేస్తూ కోల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తామని బీజేపీ ప్రకటించింది. వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టుకు కాంగ్రెస్ కూడా తన మేనిఫెస్టోలో చోటు కల్పించింది.

సుల్తానాబాద్‌లో డ్రైపోర్టు

తెలంగాణలో డ్రైపోర్టుల ఏర్పాటు ఉమ్మడి రాష్ట్రం నుంచే ఉంది. ఈమేరకు గత బీఆర్‌ఎస్, అంతకు ముందు కాంగ్రెస్ హయాంలోనూ ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. రైల్వే కనెక్టివిటీ, సరిపడినంత భూమి ఉండటంతో సుల్తానాబాద్‌లో డ్రైపోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని అధికారులు సూచించారు. తాజాగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో డ్రైపోర్టుల ఏర్పాటుకు చోటు కల్పించడంతో సుల్తానాబాద్ డ్రైపోర్టుపై ఆశలు చిగురిస్తున్నాయి.

నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు

ఉమ్మడి జిల్లాలో కేంద్రీయ విద్యాలయాలు కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్లలోనే ఉన్నాయి. జగిత్యాలలో ఇంతవరకూ ఏర్పాటు చేయలేదు. ఉమ్మడి జిల్లాలో చొప్పదండి మినహా మరే ప్రాంతంలో నవోదయ విద్యాలయాలు లేవు. కొత్త జిల్లాలు ఏర్పాటు అయ్యాక జిల్లాకో నవోదయ విద్యాలయాలు రావాల్సి ఉన్నా.. ఇంతవరకు ఆ డిమాండ్ అమలు కాలేదు. తాజాగా కాంగ్రెస్ తాము అధికారంలోకి వస్తే నవోదయ, కేంద్రీయ విద్యాలయాల సంఖ్య పెంచుతామని పేర్కొనడం విశేషం.

సింగరేణి పారిశ్రామిక కారిడార్

బెల్లంపల్లి నుంచి కొత్తగూడెం వరకు పలు గనులు, ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులను సింగరేణి కలిగి ఉంది. ఈ ప్రాంతంలో సింగరేణి పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తే.. కొత్త గనులు, పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు దక్కే సూచనలు మెండుగా ఉంటాయి. మేనిఫెస్టోలోని ఈ హామీ ద్వారా సింగరేణి ప్రస్తుత, విశ్రాంత కార్మికులతోపాటు, నిరుద్యోగులు, యువతను ఆకట్టుకునే యత్నం చేసింది.

- మైనార్టీ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం
- 'సాక్షి'తో రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ



వక్ఫ్ ఆస్తుల పరిరక్షణే కర్తవ్యం

గంభీరావుపేట(సిరిసిల్ల): వక్ఫ్‌భూములు, ఆస్తుల పరిరక్షణే ప్రథమ కర్తవ్యం.. మైనార్టీ యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తానని రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ పేర్కొన్నారు. పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా స్వగ్రామం గంభీరావుపేట మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా 'సాక్షి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

సేవలను గుర్తించి..

కాంగ్రెస్ పార్టీలో పాతికేళ్లుగా పనిచేస్తున్నాను. నా సేవలను పార్టీ గుర్తించి రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ పదవిని ఇచ్చింది. ఈ పదవి రావడం ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులకు ఇదే ప్రథమం. సిరిసిల్ల నుంచి కేబినెట్ హోదాలో గతంలో పాటిరాజం పనిచేశారు. రెండోసారి కేబినెట్ హోదాలో నేను పనిచేయడం గర్వంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలుత నా పదవినే ప్రకటించింది. గతంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఏఐసీసీలో పలు పదవులు నిర్వర్తించాను.

వక్ఫ్ ఆస్తులను కాపాడుతాను

రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌గా నియమితులైన తర్వాత పకడ్బందీ ప్రణాళికతో ముందుకుసాగుతున్నాను. రాష్ట్రంలో 70 శాతం వక్ఫ్ భూములు, ఆస్తులు ఆక్రమణకు గురయ్యాయి. మరో 10శాతం కోర్టుల పరిధిలో ఉన్నాయి. వాటిని తిరిగి పొందేలా, మిగిలిన 20 శాతం వక్ఫ్ ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా కాపాడడమే ధ్యేయంగా పనిచేస్తాను. మైనార్టీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తాను.

ఉపాధి అవకాశాలు

నా సొంత ప్రాంతం సిరిసిల్లకు చేయాల్సింది చాలా ఉంది. ముఖ్యంగా గ్రామాల్లోని మైనార్టీ యువతకు ఉపాధి మార్గాలు చూపేలా కృషి చేస్తాను. భవిష్యత్‌లో నాకు గుర్తింపు ఉండేలా జిల్లా కోసం పనులు చేస్తాను.

డిక్లరేషన్ అమలుకు కృషి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు 10 అంశాలతో కూడిన మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించింది. మైనార్టీలకు ప్రయోజనం చేకూరేలా డిక్లరేషన్ అంశాలను అమలయ్యే విధంగా కృషి చేస్తాను. మైనార్టీల సంక్షేమానికి పాటుపడుతా. మైనార్టీల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా పనిచేస్తాను.

హమ్మయ్యా దాహం తీరింది



నీటి జాడ దొరికింది



గొంతు తడుపుకుందాం..



హమ్మయ్యా..

సిరిసిల్ల: మండుతున్న ఎండల్లో మనుషులే కాదు.. పక్షులు అల్లాడుతున్నాయి. నీటిబిందువులు దొరక్క పిచ్చుకలు అలమటిస్తున్నాయి. సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌లో ఓ ప్రైవేటు బోరు వద్ద లీకేజీ నీటితో పిచ్చుకలు దాహం తీర్చుకోవడం కనిపించింది. పైపు నుంచి లీకేజీ అవుతున్న నీటిని తాగుతూ ప్రాణం నిలుపుకుంటున్నాయి. ఒక్కదాని తర్వాత మరోటి వస్తూ గొంతు తడుపుకోవడం విశేషం. ఐదారు పచ్చుకలు ఇలా వస్తూ.. దాహం తీర్చుకోవడం 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.

చేతి బోరు.. రాదు నీరు



ఇది జిల్లా కేంద్రంలోని శివనగర్ పవర్‌బోరు. ఈ బోరు నీటిని మూడు ప్రాంతాలకు చెందిన 30 కుటుంబాల వారు పట్టుకునే వారు. రిపేరు అవసరమైతే కూడా ఆ నీరు పట్టుకునే కుటుంబాల వారే ఖర్చు భరించేవారు. విద్యుత్ బిల్లులు మున్సిపల్ అధికారులు చెల్లించేవారు. కానీ మిషన్ భగీరథ ద్వారా నల్లా నీరు రావడంతో ఈ బోరు వట్టిపోయింది. బోరు నీటిని వినియోగించేవారు కరువయ్యారు.



ఇది సిరిసిల్ల మెయిన్ రోడ్డులోని ఓ బోరు. చేతిబోరు పాడయితే మున్సిపల్ అధికారులే ఇలా మరమ్మతులు చేసేవారు. ఇప్పుడు ఈ ప్రత్యేక విభాగమే మున్సిపల్‌లో కరువైంది. మిషన్ భగీరథ నీరు రావడంతో చేతిబోర్లు రిపేరు చేసే విభాగం కనుమరుగైంది. ఒక్కటి రెండు కాదు.. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో.. పల్లెల్లోనూ చేతిబోర్లను రిపేరు చేయడం లేదు.

- జిల్లాలో 1,817 చేతిబోర్లకు సామూహిక విశ్రాంతి
- బోర్లలో అడుగంటిన నీరు
- మిషన్ భగీరథపైనే ఆధారం
- ముందస్తు వేసవి ప్రణాళిక కరువు

కరువు కథలు

జిల్లాలో బోర్ల వివరాలు ఇలా..

మండలం	చేతిబోర్లు	పనిచేయని బోర్లు
బోయినపల్లి	415	305
చందుర్తి	283	165
ఇల్లంతకుంట	261	211
గంభీరావుపేట	161	101
కోనరావుపేట	297	215
ముస్తాబాద్	153	102
రుద్రంగి	92	75
సిరిసిల్ల	58	39
తంగళ్లపల్లి	158	86
వీర్నపల్లి	126	89
వేములవాడఅర్బన్	102	76
వేములవాడరూరల్	256	187
ఎల్లారెడ్డిపేట	188	166
మొత్తం	2,550	1,817

సిరిసిల్ల: మండుతున్న ఎండల్లో జిల్లా ప్రజలు నీటికష్టాలు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని 255 గ్రామాలకు, 359 నివాస ప్రాంతాలకు మిషన్‌భగీరథ నీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ శుక్రవారం మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంటులో నిర్వహణ కారణంగా జిల్లా వ్యాప్తంగా నీటి సరఫరాను నిలిపివేశారు. ఫలితంగా రాజన్నసిరిసిల్ల జిల్లాలో నీటి ఇబ్బందులు ఎదురయ్యాయి. గతంలో ఎన్నడూ లేనంతగా భూగర్భ జలాలు 26 మీటర్లకు పడిపోవడంతో బోర్లు వట్టిపోయాయి. జిల్లా కేంద్రంలోని శివనగర్, ప్రగతినగర్ ప్రాంతాల్లోని బోర్లు ఎండిపోయి ట్యాంకర్ల ద్వారా నీరు తెప్పించుకుంటున్నారు. గతంలో ఏటా వేసవికాలంలో చేతిబోర్లు జనాల నీటికష్టాలను తీర్చేవి. కానీ మిషన్‌భగీరథ నీటి రాకతో చేతిబోర్లను పట్టించుకునే వారు కరువయ్యారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న చేతిపంపులు అన్ని పనికి రాకుండా పోయాయి. వాటి మరమ్మతులు కూడా చేయడం లేదు.

ముందు చూపు ఏదీ?

జిల్లా పరిషత్, మండల పరిషత్ పరిధిలో ఏటా వేసవి ప్రణాళిక సిద్ధం చేసి, నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించేవారు. ఆయా ప్రాంతాల్లో నీటి సమస్యను అధిగమించేందుకు ప్రణాళికను సిద్ధం చేసేవారు. మిషన్ భగీరథ నీరు వస్తుండడంతో అధికారులు వేసవి ప్రణాళికను విస్మరించారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండే చేతిబోర్లను రిపేరు చేయడం లేదు. భూగర్భజలాలు పడిపోవడంతో ఇప్పటి వరకు తాగునీరు అందించిన బోర్లు, చేతిబోర్లు సైతం ఎండిపోయాయి. కొద్దిపాటి పైపులు దించితే నీరు వచ్చే అవకాశం ఉన్నా.. పైపులు కొనేందుకు నిధులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



నాంపల్లి వద్ద వట్టిపోయిన చేతి బోరు

మిషన్ భగీరథపైనే ఆశలు

జిల్లా వ్యాప్తంగా మిషన్ భగీరథ ద్వారా 255 గ్రామాలకు నీరు అందిస్తున్నారు. కానీ తాత్కాలిక అవసరాలను తీర్చే చేతిబోర్లు పనిచేయడం లేదు. మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయినప్పుడు, లేదా నిర్వహణ ఉన్నప్పుడు జిల్లాలో నీటికి ఇబ్బందులు తప్పడం లేదు. జనం ట్యాంకర్లపై, వ్యవసాయబోర్లపై ఆధారపడుతున్నారు. ప్రస్తుతం మధ్యమానేరులో ఏడు టీఎంసీల నీరు ఉండగా.. మిషన్ భగీరథకు నీరు అందుతుంది. కానీ ఇంకా డెడ్ స్టోరేజీ(మూడు టీఎంసీలు)కి పడిపోతే జిల్లాలో నీటికష్టాలు తప్పవు.

బోర్లను రిపేరు చేస్తున్నాం



జిల్లాలో నీరు ఉన్న చేతిబోర్లలో పైపులు దించుతున్నాం. ఇప్పటికే 110 బోర్లలో పైపులు దించాం. నీరు అందించే 210 బోర్లు జిల్లాలో వినియోగంలో ఉన్నాయి. ఇంకా ఎక్కడైనా అవసరం ఉంటే.. పైపులు దింపి చేతిబోర్లను వినియోగంలోకి తెస్తాం. నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– వీరబుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి

వడ్లు ఎందుకు కొనడం లేదు

- క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలి
- బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్



సంకెపల్లిలో రైతులతో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

వేములవాడఅర్బన్: రైతుల పరిస్థితి దుర్భరంగా మారిందని, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ధాన్యం కొనడం లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. వేములవాడ మండలం సంకెపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో శుక్రవారం రైతులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దళారీ వ్యవస్థను రూపుమాపి, తరుగు విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ఎన్నికల మేనిఫెస్టులో ప్రకటించి.. ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రూ.2లక్షలు రుణమాఫీ చేయకుండా రైతులను డిఫాల్టర్లుగా చేసిన ప్రభుత్వం కొత్తగా వడ్డీ లేకుండా రూ.3లక్షల రుణం ఎలా ఇస్తారని ప్రశ్నించారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడం దేవుడెరుగు, మద్దతు ధర కూడా రావడం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో లేనిపోని హామీలిచ్చి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక గాలికొదిలేశారన్నారు. జనగామలో క్వింటాల్ వడ్లకు రూ.1500 నుంచి రూ.1700 కొంటుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఢిల్లీ పంపడానికి పైసలుంటాయి.. అభ్యర్థులకు పంపడానికి పైసలుంటాయి.. కానీ రైతులకు రూ.500 బోనస్ ఇవ్వడానికి పైసలుండవు అని మండిపడ్డారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బుర్ర లహరిక, మోహన్‌రావు, జింక అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ భూమిని కాపాడాలి

- హద్దులు ఏర్పాటు చేయాలి
- ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు దశరథం



సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని విశ్వనాథస్వామి ఆలయం స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం కోరారు. పార్టీ ఆఫీసులో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. దేవుని భూమి ఇప్పటికే కొంత కబ్జాకు గురైందన్నారు. అప్పటి వరకు దేవునిస్థలం సర్వేనంబర్ పక్కన స్థలాల్లో ఎలాంటి వెంచర్లకు అనుమతులు ఇవ్వరాదన్నారు. దేవుని మాన్యాలు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టింపులేకుండా వ్యవహరిస్తే ఎలా అని ప్రశ్నించారు. కుడిక్యాల లక్ష్మణ్, గుజ్జె దేవదాసు, మచ్చ అనసూర్య, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే స్థలం కబ్జా

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



సిరిసిల్లటౌన్: అధికారుల నిర్లక్ష్యంతోనే దేవుని స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆరోపించారు. కార్మిక భవనంలో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. సిరిసిల్ల విశ్వనాథస్వామి ఆలయం భూమిని కబ్జా చేసిన వారికే అధికారులు కొమ్ముకాస్తున్నట్లు ఆరోపించారు. ఎండోమెంట్, రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించగా..ఇప్పుడు అది కరెక్టు కాదని వేరే రిపోర్టును తయారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా ఉంటూ..దేవుని మాన్యాన్ని లూటీ చేసేలా జరుగుతున్న ప్రయత్నాన్ని జిల్లా కలెక్టర్ నిలువరించాలని కోరారు. సోమ నాగరాజు, అజ్జ వేణు తదితరులు పాల్గొన్నారు.

పొన్నంపై విమర్శలు సరికాదు

- కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ప్రకాశ్



సిరిసిల్లటౌన్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు సరికాదని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో నెలకొన్న సమస్యను తీర్చడానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఇక్కడి పరిశ్రమ, అనుబంధ రంగాల జేఏసీ ప్రతినిధులను హైదరాబాద్‌కు తీసుకెళ్లారన్నారు. అక్కడ చేనేత, జౌళిశాఖ కమిషనర్‌తో నేరుగా కలిపించి ఇక్కడి సమస్యలను తెలియజేయించారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు తమ పోరాటాలు, హెచ్చరికలతోనే పొన్నం ప్రభాకర్ కదిలొచ్చారని వాదించడం హాస్యాస్పదమన్నారు. వస్త్రపరిశ్రమను ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. మంత్రి పొన్నంపై అనుచిత వ్యాఖ్యలు, ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. గడ్డం నర్సయ్య, ఆకునూరి బాలరాజు, గోనె ఎల్లప్ప, తాటిపాముల దామోదర్, యెల్లె లక్ష్మీనారాయణ, పిస్క మధు, నక్క నర్సయ్య, పర్శరాములు పాల్గొన్నారు.



ఇది రాయినిచెరువు పురాతన మత్తడి కాలువ. ఇప్పుడు చెరువు లేదు. సర్కారు పట్టాలు చేసి కార్మికులకు అందించగా లోతట్టు ప్రాంతం కాబట్టి వరద నీరు పోవడానికి కాలువను అలాగే వదిలేయగా.. ఇలా కబ్జాకు గురైంది. ఇది చెరువు నుంచి గోపాల్‌నగర్ మీదుగా మూడు కిలోమీటర్ల దూరం వరకు ప్రవహించి మానేరువాగులో కలిసేది.



ఇది సిరిసిల్ల–కామారెడ్డి మార్గంలోని కార్గిల్ లేక్ చెరువు మత్తడికాలువ. చెరువు నుంచి అర కిలోమీటరు దూరంలో ఉన్న మానేరు వాగులో మత్తడినీరు కలిసేందుకు ఆనాటి కాలంలో నిర్మించిన కాలువ. కొందరు రియల్టర్లు పెద్దల అండతో పూర్తిగా పూడ్చేసి ప్లాట్లుగా అమ్మడంతో ఇలా నిర్మాణాలు జరుగుతున్నాయి..



మీరు చూస్తున్నది సిరిసిల్ల కొత్తచెరువు మత్తడికాల్వ. ఇది కబ్జాకు గురైంది. కాలువ నుంచి మూడు, రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే మానేరునదిలో కలిసే మత్తడినీటి కాలువ ఇప్పుడు ఆనవాళ్లు కోల్పోయింది. రోడ్ల విస్తరణలో భాగంగా సుమారు రూ.50లక్షలతో మత్తడికాలువపై కల్వర్టును నిర్మించడం కాలువ కబ్జా పాలైనట్లు అధికారులు..చెప్పకనే చెబుతున్నారు.



ఇది జిల్లా కేంద్రంలోని ఆటోనగర్ ప్రాంతం. సర్వేనంబర్ 1563తోపాటు చుట్టుపక్కల సర్వే నంబర్ల నుంచి కొత్తచెరువు నుంచి వ్యవసాయ కాల్వ పారేది. ఇప్పుడు ఆ ప్రాంతంలో నిర్మాణాలు వెలిశాయి. దేవుడి భూమితోపాటు వ్యవసాయకాల్వ కూడా కబ్జాకు గురైంది. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ప్రజాప్రతినిధి తమ లేఅవుట్ కోసం రోడ్డును ఇదే ప్రాంతం నుంచి చూపెట్టడం, ఆ ప్రాంతంలో బీజేపీ, కాంగ్రెస్ నేతలకు భూమి ఉందన్న అంశం చర్చనీయాంశమైంది.

కాల్వలు కబ్జా

- పరాధీనంలో రూ.కోట్ల విలువైన ఆస్తులు
- కబ్జా కోరల్లో వ్యవసాయ కాల్వలు
- నిర్జీవమవుతున్న చెరువులు
- జలవనరులని వదలని ఉల్లం'ఘనులు'
- పట్టింపులేని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు

సిరిసిల్లటౌన్: రియల్ భూం ఊపందుకోవడంతో కబ్జాదారుల కన్ను చెరువుల కాల్వలపై పడింది. కాల్వలను కబ్జా చేసి ఎంచక్కా నిర్మాణాలు చేపట్టడంతో ఏటా వర్షాకాలంలో వరదనీరు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతోంది. అడిగేవారు లేకపోవడం, భూముల విలువ రూ.కోట్లలో పలకడంతో దురాక్రమణకు గురయ్యాయి. ఆక్రమణలను నిలువరించాల్సిన రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు మిన్నకుండడంతో కాల్వలు ఆనవాళ్లు లేకుండా పోయాయి. పట్టణంలోని చెరువు కాల్వల కబ్జాపై ప్రత్యేక కథనం..

కనిపించని ఆనవాళ్లు

ఒకప్పుడు జలసిరులు కురిపించిన మత్తడి(వ్యవసాయ) కాల్వలు ఇప్పుడు నిర్జీవంగా మారాయి. కాల్వలు ఉన్నట్లు ఆనవాళ్లే లేవు. భూమి ధరలకు రెక్కలు రావడంతో యథేచ్ఛగా దురాక్రమణలు జరుగుతూనే ఉన్నాయి. ఫలితంగా ఒకప్పటి ఊరచెరువుల మత్తడి(వ్యవసాయ) కాల్వలు ఇప్పుడు పరాధీనమయ్యాయి.

కనుమరుగవుతున్న చెరువులు

సిరిసిల్ల పట్టణాన్ని ఆనుకుని ఉన్న చెరువులు కబ్జాదారుల దురాక్రమణతో కనుమరుగవుతున్నాయి. పూర్వీకులు రాబోయే కరువు కాలాన్ని అంచనా వేసి సిరిసిల్ల చుట్టు తొమ్మిది చెరువులు గొలుసుకట్టు పద్ధతిలో నిర్మించారు. వర్షాలతో ఒక చెరువు నిండిన తర్వాత దాని కింద చెరువుకు నీరు వెళ్లేలా కాలువలు తవ్వించారు. కాలక్రమంలో రాయినిచెరువు, తుమ్మలకుంటలను నివాస స్థలాలుగా అభివృద్ధి చేయగా వాటి ఆనవాళ్లు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం పట్టణానికి ఇరువైపులా ఉన్న కొత్తచెరువు, కార్గిల్‌లేక్ చెరువులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. అభివృద్ధి పేరుతో వీటిస్థలాలు కూడా ఆక్రమణకు గురవడంతో వర్షాకాలంలో నీరు రోడ్లమీదకు వచ్చి లోతట్టు ప్రాంతాలను ముంచేస్తున్నాయి. ఈదులచెరువు, దేవునికుంట, మైసమ్మకుంట, దామెరకుంట రెవెన్యూశాఖ ఆధీనంలో ఉన్నాయి. కొత్తచెరువు, కార్గిల్‌లేక్ స్థలాలు, మత్తడికాల్వలు కబ్జాకు గురైనట్లు సంబంధితశాఖల అధికారులకు తెలిసినా చర్యలు చేపట్టడంలో కినుక వహించడం విమర్శలకు తావిస్తుంది.

పరాధీనంలో నీటికాల్వలు

కార్గిల్‌లేక్, రాయినిచెరువు, తుమ్మలకుంట, కొత్తచెరువులకు సంబంధించిన మత్తడికాల్వలు పూర్తిగా అన్యాక్రాంతమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం గజానికి రూ.30వేల నుంచి రూ.50వేలు పలుకుతుంది. ఒక్కో కాల్వ 33 ఫీట్ల వెడల్పుతో కిలోమీటర్ల పొడవుగా ఉండేవాటి విస్తీర్ణం వందల ఎకరాలు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. వీటి విలువ వందల కోట్లలోనే ఉంటుందని రియల్ ఎస్టేట్ వర్గాల అంచనా. అందుకే అక్రమార్కులు కాల్వలను కబ్జా చేస్తుంటే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

సిరిసిల్లలో చెరువుల వివరాలు

చెరువు	సర్వేనంబర్	విస్తీర్ణం(ఎకరాల్లో)	కాలువ(కి.మీ)
కొత్తచెరువు	1471	85.05	4
రాయినిచెరువు	703	152.10	3
ఈదులచెరువు	991	77.29	1.5
అర్జునకుంట	757	22.36	01
దేవునికుంట	1121	9.28	1.5
మైసమ్మకుంట	1294	11.02	01
దామెరకుంట	232, 233	7.38	02
తుమ్మలకుంట	142, 143	29.23	02
వర్ధనికుంట	–	–	–

రెవెన్యూ సహకారంతో చర్యలు

సిరిసిల్ల పట్టణం పెరుగుతుండడంతో కాలువలు ఆనవాళ్లు లేకుండా పోయాయి. పాత రికార్డులను బట్టి జిల్లా సర్వేయర్‌తో కలిసి చెరువులు, వాటికాల్వల హద్దులు నిర్ణయిస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటాం. సిరిసిల్ల చెరువులు కొన్ని మా పరిధిలో మరికొన్ని రెవెన్యూ, మున్సిపల్ పరిధిలో ఉన్నాయి. సంబంధితశాఖల అధికారుల సహకారంతో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

– కిశోర్, ఇరిగేషన్ డీఈఈ

చెరువులు, కాల్వల నుంచి గొలుసుకట్టు దూరంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదన్న నిబంధనలు కూడా అధికారులు అమలు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెరువు కట్టలను ఆనుకుని ఎలాంటి నిర్మాణాలు ఉండకూడదన్న నిబంధనలు ఎక్కడ అమలు కావడం లేదు. ఈదులచెరువు, అర్జునకుంట, దేవునికుంట, మైసమ్మకుంట, దామెరకుంటల స్థలాలు రక్షించడంలో అధికారుల పట్టింపులేమితో వాటికి కూడా రక్షణ లేకుండా పోతుంది.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. కోరుట్ల–మెట్‌పల్లి జాతీయ రహదారిపై ఇద్దరు, మల్లాపూర్ మండలంలోని రాఘవపేటలో యువరైతు, యైటింక్లయిన్ కాలనీ సంతోష్ నగర్‌కు చెందిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరు..

కోరుట్ల/మెట్‌పల్లిరూరల్: కోరుట్ల–మెట్‌పల్లి జాతీయ రహదారిపై రెండు బైక్‌లు ఢీకొని, ఇద్దరు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల పట్టణానికి చెందిన తొగిటి వెంకటేశ్(28) తన స్నేహితుడు ఇందూరి శ్రీనివాస్(27)తో కలిసి బంగారు ఆభరణాల పని మీద శుక్రవారం బైక్‌పై మెట్‌పల్లికి వెళ్లి, రాత్రి 10 గంటలకు తిరిగివస్తున్నారు. అదే సమయంలో మెట్‌పల్లికి చెందిన మీర్జా ఖాజాబేగ్(45) తన ఇద్దరు కూతుళ్లు ఆయేషా, అనుఫాతిమాలతో కలిసి బైక్‌పై కోరుట్ల నుంచి మెట్‌పల్లి వెళ్తున్నాడు. వీరి వాహనాలు కోరుట్ల–మెట్‌పల్లి మధ్యలోని పెద్ద గుండు సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనాలు నడుపుతున్న వెంకటేశ్, మీర్జాఖాజా బేగ్‌లు అక్కడికక్కడే మృతిచెందారు. మీర్జా ఖాజా బేగ్ కూతుళ్లు, శ్రీనివాస్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

జ్యూస్ తాగిద్దామని తీసుకువచ్చి..

మెట్‌పల్లికి చెందిన మీర్జా ఖాజా బేగ్ గురువారం రంజాన్ పండుగ జరుపుకున్నాడు. కోరుట్లలో పేరొందిన ఫలుదా జ్యూస్‌ను తన కూతుళ్లకు తాగిద్దామని కోరుట్లకు తీసుకువచ్చినట్లు సమాచారం. తిరిగి మెట్‌పల్లి వెళ్తుండగా ప్రమాదం జరిగి, అతను ప్రాణాలు వదలడం అందరినీ కంటతడి పెట్టించింది.

ఒక్కగానొక్క కొడుకు..



వెంకటేశ్ (ఫైల్)



ఖాజా బేగ్ (ఫైల్)

కోరుట్లలోని అయిలాపూర్ రోడ్‌లో వీరబ్రహేంద్రస్వామి గుడి వద్ద నివాసముండే తొగిటి రమేశ్–జల దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు వెంకటేశ్. ఇతను బంగారు ఆభరణాల వ్యాపారంలో ఉన్నాడు. ఆభరణాల్లో వజ్రపు రాళ్లు తాపడం చేయించడం కోసం మెట్‌పల్లి వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలోనే అతను మృతిచెందాడు. వెంకటేశ్‌కు రెండేళ్ల క్రితం హారికతో వివాహం జరిగింది. వీరికి 11 నెలలు బాబు ఉన్నాడు. ఈ మధ్యనే ఆ చిన్నారికి పుట్టు వెంట్రుకలు తీయించినట్లు బంధువులు తెలిపారు. చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలను, మోటార్ సైకిళ్లను తొలగించేందుకు కోరుట్ల, మెట్‌పల్లి ఎస్సైలు కిరణ్, చిరంజీవిలు అవసరమైన చర్యలు తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు.

మీర్జా గది పక్కనే అద్దెకున్న వ్యక్తికి ప్రమాదం..

మీర్జా ఖాజా బేగ్ అద్దెకున్న ఇంట్లోనే అద్దెకున్న వహీద్ ఇబ్రహీంపట్నం మండలం సత్తక్కపల్లి బ్రిడ్జి సమీపంలో శుక్రవారం రాత్రి బైక్‌పై వెళ్తూ చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలపాలయ్యాయి. మెట్‌పల్లి పోలీసులు వహీద్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యైటింక్లయిన్ కాలనీ సంతోష్‌నగర్‌వాసి..



ప్రశాంత్ (ఫైల్)

పెద్దపల్లిరూరల్/యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీ 17వ డివిజన్ సంతోష్‌నగర్‌కు చెందిన బొజ్జ పోషమల్లు(పోచం)–వసంత దంపతులకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. పోషమల్లు లారీ డ్రైవర్. వీరి కుమారుడు ప్రశాంత్(25) హైదరాబాద్‌లో పని చేస్తుంటాడు. శుక్రవారం బైక్‌ను పెద్దపల్లిలో ఉంచి, హైదరాబాద్ వెళ్తానని ఇంట్లో చెప్పి, బయలుదేరాడు. మార్గమధ్యలో పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ శివారులో ఓ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. చేతికి అందివచ్చిన కుమారుడు విగతజీవిగా కనిపించడంతో ప్రశాంత్ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఈ ఘటన సంతోష్‌నగర్‌లో విషాదం నింపింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాఘవపేటలో యువ రైతు..



గంగాధర్ (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): రోడ్డు ప్రమాదంలో ఓ యువరైతు మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మల్లాపూర్ మండలంలోని రాఘవపేటకు చెందిన మాదం గంగాధర్(32)కు భార్య సౌమ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతను వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పనిమీద బైక్‌పై వెళ్తుండగా గ్రామంలోని మసీదు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు.

బావి వద్ద నిద్రించి.. అందులోనే పడి

- యువకుడి మృతి
- నిద్ర మత్తు వల్లే ప్రమాదం
- సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలు
- మర్రిపల్లిలో విషాదం

వేములవాడరూరల్: రాత్రి సమయంలో ప్రయాణం వద్దు కొడుకా అని తల్లి చెప్పినప్పటికీ వినలేదు.. ఏం కాదమ్మా తెల్లవారేసరికి హైదరాబాద్‌లో ఉంటా.. అంటూ బైక్‌పై వెళ్లిన ఓ యువకుడు దారిలో బావి వద్ద నిద్రించి, ప్రమాదవశాత్తు అందులోనే పడి మృతిచెందాడు.. ఈ ఘటన వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లిలో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిపల్లికి చెందిన రాచర్ల మల్లేశం–లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కొడుకు కౌశిక్(23) హైదరాబాద్‌లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. సెలవులకు ఇంటికి వచ్చి, తిరిగి గురువారం రాత్రి 8 గంటలకు బైక్‌పై హైదరాబాద్ బయల్దేరాడు. తల్లి వద్దని చెప్పినా వినిపించుకోకుండా తెల్లవారేసరికి అక్కడుంటానంటూ వెళ్లాడు.



కౌశిక్ (ఫైల్)

సిద్దిపేట జిల్లా ఇమాంబాద్ వద్ద ప్రధాన రోడ్డు పక్కన వాహనాన్ని ఆపాడు. హెల్మెట్, బ్యాగు అక్కడే పెట్టి బావి పక్కన ర్యాంప్‌పై నిద్రించాడు. నిద్ర మత్తులో ప్రమాదవశాత్తు బావిలో పడి, చనిపోయాడు. ఉదయం గమనించిన స్థానికులు బైక్ నంబర్ ఆధారంగా వివరాలు తెలుసుకొని, మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి వెళ్లి చూడగా బావిలో శవమై తేలాడు. కుమారుడి మృతితో ఆ తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించారు. విషయం తెలుసుకున్న అక్కడి పోలీసులు కౌశిక్ మృతికి గల కారణాలపై విచారణ చేపట్టారు. అతను వాహనాన్ని ఆపడం, ర్యాంప్‌పై నిద్రించడం వంటి దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయినట్లు గుర్తించారు. అనంతరం పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కౌశిక్ మరణ వార్త విన్న అతని స్నేహితులు, గ్రామస్తులు విషాదంలో మునిగారు.

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే

- మహిళా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం
- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు వనిత



మాట్లాడుతున్న కాముని వనిత

సిరిసిల్లటౌన్: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటై సిరిసిల్ల వస్త్రపరిశ్రమ, నేతకార్మికులకు అన్యాయం చేశారని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత విమర్శించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కేటాయించిన మెగా టెక్స్‌టైల్ పార్కును సిరిసిల్లలో ఏర్పాటు చేయకుండా వరంగల్‌కు తరలించుకుపోయారన్నారు. ఐదేళ్లుగా ఎంపీ బండి సంజయ్ సిరిసిల్లకు రాలేదని, ఇప్పుడు ఎన్నికల వేళలో వస్తూ.. ఓట్ల రాజకీయం చేస్తున్నారే తప్ప నేతకార్మికులను ఏనాడూ ఆదుకోలేదన్నారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ఇప్పటి మంత్రి పొన్నం ప్రభాకర్ సిరిసిల్లకు, నేతకార్మికుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ప్రజల మద్దతు ఉందన్నారు. మడుపు శ్రీదేవి, వెల్ముల స్వరూప తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లలో నకిలీ నియామక పత్రంపై చర్చ

- ఓ యువతి వద్ద రూ.30 వేలు తీసుకొని, ఇచ్చినట్లు సమాచారం

కోరుట్ల: స్థానిక అల్లమయ్యగుట్ట బస్తీ దవాఖానాలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు నిమిత్తం ఓ యువతికి నకిలీ నియామక పత్రం ఇచ్చారన్న అంశం కోరుట్లలో చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల పట్టణంలోని బిలాల్‌పురకు చెందిన యువతి అల్లమయ్యగుట్ట బస్తీ దవాఖానాలో కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఇప్పించాలని కథలాపూర్‌కు చెందిన ఓ వ్యక్తిని సంప్రదించింది. అతను రూ.30 వేలు తీసుకొని, ఆమెకు నకిలీ నియామక పత్రం ఇచ్చినట్లు తెలిసింది. బాధితురాలు దాన్ని తీసుకొని శుక్రవారం సదరు ఆస్పత్రికి వెళ్లగా అక్కడ ఇదివరకే ల్యాబ్ టెక్నీషియన్ ఉండటం, మరో పోస్టు ఖాళీ లేకున్నా నియామక ఉత్తర్వులు ఎలా వచ్చాయని వైద్య సిబ్బంది ఆశ్చర్యపోయారు. ఈ విషయాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ దృష్టికి తీసుకెళ్లగా తాము ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని అధికారులు బదులిచ్చారు. దీంతో వైద్య సిబ్బంది పోలీసులకు చెప్పడంతో ఆ యువతిని అదుపులోకి తీసుకొని, నకిలీ నియామక పత్రం ఎక్కడి నుంచి వచ్చిందని విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

బాలుడిని కబళించిన కేన్సర్

- బహ్రెయిన్‌లో తండ్రి
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబసభ్యులు



మనుదీప్ (ఫైల్)

చందుర్తి(వేములవాడ): కేన్సర్‌తో ఓ బాలుడు మృతిచెందిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేటలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మ్యాకల శ్యామల–శంకరయ్య దంపతులకు ఇద్దరు ఆడపిల్లల తర్వాత మూడో సంతానంగా మనుదీప్(11) జన్మించాడు. ఈ బాలుడు కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్నాడు. వైద్యం చేయించేందుకు రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వచ్చే వరకు అంత్యక్రియలు చేయొద్దన్న తండ్రి

మనుదీప్ తండ్రి శంకరయ్య జీవనోపాధి నిమిత్తం బహ్రెయిన్ వెళ్లాడు. కుమారుడి మరణ వార్త తెలిసి, తాను వచ్చే వరకు అంత్యక్రియలు చేయొద్దని బంధువులను ఫోన్‌లో కోరాడు. శంకరయ్య శనివారం స్వగ్రామం చేరుకుంటాడని కుటుంబసభ్యులు తెలిపారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో 'అల్ఫోర్స్'కు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ విద్యార్థులు ఇటీవల హైదరాబాద్‌కు చెందిన పోటీ పరీక్షల సంస్థ సిల్వర్ జోన్ ఫౌండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ సైన్స్ ఒలింపియాడ్‌లో బంగారు పతకాలు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. హారన్, కె.ఆరాధ్య (నాలుగో తరగతి), మహమ్మద్ హస్నన్, ఎస్.సింగిరెడ్డి(ఐదోతరగతి), సి.హానిష్ (ఏడోతరగతి) అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈ మేరకు పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ పీటీఎస్ సెక్యూరిటీగార్డు మృతి

- మృతుడి స్వస్థలం ప్రకాశం జిల్లా గిద్దలూరు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లో పని చేసే సెక్యూరిటీగార్డు ఎం.రంగనాయకులు(50) మృతిచెందాడు. పీటీఎస్‌లోని ఎ–4/57 క్వార్టర్‌లో ఉంటున్న ఆయన శుక్రవారం ఉదయం విధులకు రాకపోవడంతో సిబ్బంది అతని గదికి వెళ్లి, పరిశీలించారు. లోపల అచేతనంగా పడి ఉండటంతో ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన వాడని, విషయాన్ని అతని కుటుంబసభ్యులకు తెలియజేశామన్నారు. వారి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రంగనాయకులు మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి మార్చురీకి తరలిస్తామన్నారు.

జూనియర్ అసిస్టెంట్, ఆమె భర్తపై ఫోర్జరీ కేసు

తిమ్మాపూర్(మానకొండూర్): ఎల్‌ఎండీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జి.తిరుమల, ఆమె భర్త రాజ్‌కుమార్‌లపై ఫోర్జరీ కేసు నమోదైంది. ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమల, రాజ్‌కుమార్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజభాను చంద్రప్రకాశ్ సంతకాలు ఫోర్జరీ చేశారు. తప్పుడు బిల్లులు సృష్టించి, ట్రెజరీకి సమర్పించి అకౌంట్లు మార్చారు. ఉపాధ్యాయుల వేతనాల నుంచి అధిక చెల్లింపులు రికవరీ పేరిట హెచ్‌ఎంకు తెలియకుండా డబ్బులు వసూలు చేశారు. దీంతో ఆయన శుక్రవారం ఎల్‌ఎండీ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆ దంపతులపై ఫోర్జరీ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగిసిన నగేశ్ కస్టడీ..

సంతకాలు ఫోర్జరీ చేసి, తప్పుడు భూ పత్రాలు సృష్టించిన కరీంనగర్ పాతబజార్‌కు చెందిన నగేశ్‌ను ఇటీవల ఎల్‌ఎండీ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్ భూ వ్యవహారంలో కంది జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతన్ని అరెస్టు చేసి, జైలుకు తరలించారు. విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకోగా శుక్రవారం ముగియడంతో తిరిగి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

మద్యం పట్టివేత

జమ్మికుంట(హుజూరాబాద్): మున్సిపల్ పరిధిలోని ధర్మారంలో మండ ఎల్లయ్యకు చెందిన బెల్టు షాపులో శుక్రవారం తనిఖీలు చేపట్టామని సీఐ రవి తెలిపారు. రూ.2,720 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.